# శంకరంబాడి సుందరాచారి - ఓ మధుర జ్ఞాపకం (అముద్రితం)

డాక్టర్ ఎర్నేని వెంకటేశ్వరరావు, అణుశాస్త్రవేత్త – గుడివాడ

విజిటింగ్ ప్రొఫెసర్, బాబా అణు కేంద్రం

అవి నేను బెనారస్ యూనివర్శిటీలో ఎమ్మెస్సీ భౌతికశాస్త్రం చదువుతున్న రోజులు. 1955వ సంవత్సరం నవంబరు నెల. తేదీ సరిగ్గా గుర్తులేదు. బాగా చలికాలం. ఇక్కడ చదువుకునే తెలుగు విద్యార్థులందరూ ఆంధ్రా అసోసియేషన్ పేరుతో సంఘటితంగా ఉండేవాళ్ళం. అయితే ఆ సంవత్సరం కార్యవర్గం ఎందువల్లనో ఎన్నికైనా కూడా పని చేయలేదు. దానితో కాస్త చైతన్యం తగ్గింది. ఇలా వుండగా ఒకరోజు మధ్యాహ్నం అతిసామాన్యంగా పొట్టిగా వామన రూపంలో వున్న ఓ మధ్య వయస్సు దాటిన వ్యక్తి యూనివర్శిటీకి వచ్చారు. బెనారస్ యూనివర్శిటీలో అన్ని భాషా ప్రాంతాలవారికి ఉన్నట్లే మన తెలుగు వాళ్ళకి కూడా ప్రతీ హాస్టల్లో ప్రత్యేకంగా ఒక మెస్ ఉండేది. సైన్స్ వాళ్ళ బ్రోచా హాస్టల్ వద్ద వున్న నా దగ్గరకొచ్చి ఆయన "నువ్వు తెలుగువాడివేనా?" అని అడిగారు. నేను "ఔను" అన్నాను. ఇక్కడి ఆంధ్రా అసోసియేషన్ వాళ్ళను కలవాలి. వాళ్ళ మీటింగ్‌లో మాట్లాడాలి" అన్నారు. ఈ సంవత్సరం అది పనిచేయటంలేదని చెప్పాను. "మరి నేను మాట్లాడాలనుకుంటున్నానే, సరే ఒక పని చేయి రేపు సాయంత్రం 4 గంటలకు తెలుగు వాళ్ళందరికీ ఈ ప్రాంగణంలో ఎక్కడ పెడతారో ఒక సభ పెట్టించండి. శంకరంబాడి సుందరాచారి అంటే ఎవరో నాకు అర్థం కాలేదు. ఎవర్రా ఈయన పిలవకుండా వచ్చి మాట్లాడతాను మీటింగ్ పెట్టమని చెబుతున్నాడు అనుకుంటున్నాను. అంతలో ఆయనే "నా పేరు అందరికీ తెలిసివుండకపోవచ్చు. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' పాట రచయిత వచ్చారు మాట్లాడతారట అని నోటీసులో పెట్టు" అన్నారు. అప్పటికి నా బుర్ర వెలిగి ఓరి, ఈయనా ఆ గీతం రాసింది అని మనసులో తలుచుకుని ఏదో తెలియని గౌరవంతో వివరాలేమీ అడక్కుండా "అలాగేనండి" అనేశాను. ఆయన వెళ్ళిపోయారు. కొందరు మిత్రులను కలుపుకుని సభా ఏర్పాట్లలో పడ్డాను.

మొత్తానికి రెండో రోజు సాయంత్రం 4 గంటలకు ఊహించిన దానికంటే ఎక్కువగా కాలేజీ ఆఫ్ ఎండాలజీ జనరల్ గ్యాలరీలో తెలుగువాళ్ళంతా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వస్తానన్న అతిథికోసం ఎదురుచూస్తున్నాం. ఆయన చెప్పిన సమయం నాలుగు దాటిపోయింది. నాలుగున్నర... ఐదు...ఐదున్నర... మనిషి అంతులేడు. కిటకిటలాడే ప్రేక్షకుల్లో ఉద్రేకం చోటుచేసుకుంటోంది. ప్రచారం చేసినది ఎవరంటూ ప్రశ్నలు మొదలైతున్నాయి. "నిజంగా మా తెలుగుతల్లి గీత రచయితేనా?" "నిజంగా నాలుగు గంటలకు వస్తానన్నారా?" "మనల్ని ఎవరైనా వెధవలను చేయబూనారా?" అనే గుసగుసలు సైతం బయలుదేరాయి. మా గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. వచ్చేస్తుంటారేమో అని చూస్తుండగానే ఆరు అయిపోయింది. విద్యార్థులందరూ అసహనంతో ఊగిపోతున్నారు. మా చూపులన్నీ గేటువైపే... అప్పుడు వస్తున్నారు వామనావతారులైన హీరో... చేతిలో సంచి వేస్కొని నెమ్మదిగా నడుచుకుంటూ... హమ్మయ్యా బ్రతికించాడు ఇక ఏమన్నా అంటే ఆయన్తో చూస్కోమనవచ్చు అని "అదుగో ఆయనే వచ్చేశారు శంకరంబాడి సుందరాచారి" అని చూపించి మేము బ్రతుకుజీవుడా అని మందిలో కలిసిపోయాం.

అతి సామాన్యంగా నేత బట్టలు ధరించి, సంచి ఊపుకుంటూ... వామనునిలా నడుచుకుంటూ స్టేజి వైపు వస్తున్నారు. జనం దారి ఇచ్చారు. ఇంతలో బరంపురానికి చెందిన కుర్రాడు కాస్త గడుసుగా పైకే వినపడేలా "ఇప్పుడొచ్చాడయ్యా రెండు గంటలు ఆలస్యంగా, ఇప్పుడు మొదలు పెడితే ఎప్పటికి వదులుతాడో" అనేశాడు. ఆయన విననట్లు ఎదురుచూస్తున్నాం. "ఒరేయ్ అబ్బాయ్ నువ్వు లే" అన్నాడు బరంపురం కుర్రోడిని వేలుపెట్టి చూపిస్తూ. అసలే ఉద్రిక్త వాతావరణం. ఆయన ధోరణికి పిచ్చెక్కిపోయింది. "ఇప్పుడు మొదలుపెడితే ఎప్పటికి వదులుతాడో అన్నది నువ్వేకదా... నేను మాట్లాడటం ప్రారంభించి ఆపేలోపు నువ్వు నీ అంతట లేచి వెళ్ళగలిగితే వెళ్ళు సవాల్" అన్నాడు శంరంబాడి. ఓరి ఈయన అసాధ్యం కూడా... ఆలస్యమైనందుకు అందరూ అసహనంగా ఉంటే మాటలు చెప్పకుండా ఈ సవాళ్ళు ఏంట్రా నాయనా అని తలలు కొట్టుకున్నాం. ఆ కుర్రాడు బిక్కచచ్చిపోయాడు. ఇక సభికులందరినీ చూసి గొంతు సవరించుకున్నాడు. "ఇంత ఆలస్యమైంది కనుక నేను క్షమాపణ చెబుతానని ఎదురుచూస్తున్నారేమో అలాంటివేమీ పెట్టుకోకండి" అన్నాడు మరోసారి. అగ్నిలో ఆజ్యం పోసినట్లు అందరూ ఆగ్రహంగా ఉంటే ఈ కవ్వింపులేమిటో అర్థం కాక అసలేం జరగబోతోందనని బెదిరిపోయాం. ప్రసంగం మొదలుపెడుతూ

మీరంతా తెలుగువాళ్ళుకదా. మీకసలు తెలుగు సరిగ్గా మాట్లాడడం వచ్చా?... మీ మొఖ: మీరేం మాట్లాడుతారు. అయినా మిమ్మల్ని అనేం లాభం... కర్మ.. మీకు తెలుగు చెప్పిన మాస్టర్లని అనాలిగాని అంటూ ఇంకో బాణం సంధించారు. మీటింగు ఏర్పాటు చేసిన నాకు "ఏదో తేడా జరిగింది నాకు మూడేలా వుంది" అని బెంగపట్టుకుంది. తెలుగు ఎలా ఉంటుందో చూపిస్తాను చూడండి అంటూ చిత్రంగా వాతావరణాన్ని పూర్తిగా మార్చేస్తూ శంకరంబాడి ప్రసంగం ప్రారంభమైంది.

తెలుగు గ్రామీణ జీవనంలో తెల్లవారు ఝామున కోడికూసినది మొదలు జీవితాలు ఎలా ప్రారంభమవుతాయి. కోడి కూత నుంచి ప్రారంభించి పల్లెవడుచు కూనిరాగాలు, పశువుల అరుపులు, పిట్టల కూతలు ముగ్గులు వేసుకుంటూ ఇల్లాలు పాడే తెలుగు జానపదగీతాలు, హరిదాసు నృత్యాలు, గంగిరెద్దుల చప్పుళ్ళు, అమ్మభక్తిపాటలూ, పిల్లల ఆటలూ, పాటలూ, రైతాంగం నాగళ్ళను చేతపట్టి పొలంగట్లవెంట పోతూ పాడే జానపదాలూ, భర్తకు చద్ది మూటగట్టి గంపనెత్తిన పెట్టి తెలుగింటి ఆడపడుచు పలికే పల్లె సుద్దులు... రచ్చబండ వద్ద ఊరి పెద్దల

ఊతపదాలు, తెలుగు లోగిళ్ళలో బావామరదళ్ళ సరదాలు, సరసాలు ఒకటేమిటి యావత్ తెలుగు ప్రజల సజీవ భాషా భాగవతమంతా ఆట, పాటా, మాటల రూపంలో గంటన్నరపాటు ప్రవంతిలా ఆడుతూ, పాడుతూ ఆ వామనరూపుడుగా తలపోసిన వ్యక్తి ఆకాశమంత ఎత్తు ఎదిగిపోయినట్టు రసమయ తాండవం చేసేవారు. తెలుగు జీవన మాధుర్యాన్నీ, తెలుగు భాషలోని విశిష్టతను కళ్ళకు కట్టినట్టు సినిమా చూపించేసరికి అంతా ముగ్ధులైపోయి నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు. "ఏమోయ్ కుర్రోడా! గంటన్నర అయింది లేచి వెళ్ళలేదే... పో" అన్నారు. శంకరంబాడి బరంపురం కుర్రవాడిని ఉద్దేశించి.

"నన్ను వదిలేయండి స్వామీ అన్నాడు అతడు. "మరి నాకు విసుగేస్తోంది ఆపేస్తున్నాను అన్నారు వారు. అబ్బే లేదు లేదు మీరు ఆపేందుకు వీలులేదు ఇంకా మాట్లాడవలసిందేనని అందరూ గట్టిగా అరిచారు. మరో అరగంటసేపు నేను ఆనందంతో తబ్బిబ్బైపోయాను. అందరూ నన్ను ప్రశంసాపూర్వకంగా చూస్తున్నారు. ఇంతకూ మీరు బెనారస్‌కు ఎందుకొచ్చారని వివరమడిగారు కొందరు.

మన తెలుగు భాష తీరుతెన్నులకు సంబంధించి భాషలోని విశేషాలను క్రోడీకరిస్తూ సులభంగా అంచలవారీగా తెలుగు సాహిత్యాన్ని జీర్ణం చేసుకునేవిధంగా పండిత పామరులను దృష్టిలో ఉంచుకుని 5 అంచెలలో నిచ్చెనలు నిలిపే సాహిత్యాన్ని శంకరంబాడి రూపొందించినట్టు చెప్పారు. ప్రస్తుతం 3వ సంపుటం తీస్కొని ఢిల్లీ వెళ్ళారు. అక్కడి పెద్దలతో చర్చించారు. ఎలాగూ ఢిల్లీ వెళ్లారుగనుక తెలుగువారైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఉండటంతో ఆయన్ను కలవాలని వెళ్ళారు. 5 నిమిషాలు ఇంటర్వ్యూ ఇచ్చారు. మా తెలుగుతల్లికి మల్లెపూదండ రచయితగా పరిచయం జరగగా తెలుగు భాషా వ్యాప్తికోసం, తెలుగు భాషా స్థాయి అభివృద్ధికోసం శంకరంబాడి సుందరాచారి చేస్తున్న కృషిని రాధాకృష్ణన్ అర్థం చేసుకుని  ఆయన్ను అభినందించినట్లు సుందరాచారే చెప్పుకొచ్చారు. ఐదునిమిషాల ఇంటర్వ్యూ గంటన్నర దాటిపోయింది. సెక్యూరిటీ వాళ్ళు సమయం దాటిపోయిన సంగతి సైగ చేస్తుండగా సర్వేపల్లి వాళ్ళని పిలిచి అన్నీ రద్దు చేసేయండి. నేను రమ్మనేవరకు ఎవరూ రావద్దని చెప్పేశారు. 3వ సంపుటంలోని బుద్ధుని జీవితానికి సంబంధించిన అంశాలను భాషకు సంబంధించిన విశేషాలనూ విని మీ కృషి అనన్య సామాన్యమని మీలాంటి వారు నెహ్రూగారిని కలవాలని చెప్పారు. "వారికి మన తెలుగు గురించి తెలుస్తుందా?" అన్నారు సుందరాచారి. అందుకు రాధాకృష్ణన్ "ఒక పని చేయగలరా ఈ సంపుటిని ఇంగ్లీషులోకి తర్జుమా చేయగలిగితే పుస్తకంగా ముద్రిద్దాం. మీరు ఆ పని చేయగలరా" అన్నారు. నేను అనువదించగలను అన్నారు సుందరాచారి. మీరు ఆపని చేస్తే నేను ముద్రింపచేస్తాను అన్నారు రాధాకృష్ణన్. ఆ రాత్రంతా కూర్చుని తమ తెలుగు సాహిత్యాన్ని ఇంగ్లీషు స్టాన్‌జాల్లోకి అనువదించారు సుందరాచారి. తెల్లారి తీస్కెళ్ళి రాధాకృష్ణన్ గారికివ్వగానే దానిని ముద్రణాలయానికి పంపించారు. మొత్తం 48 గంటల్లో పుస్తకాలు సిద్ధమయ్యాయి. ఇద్దరూ బయలుదేరి వెళ్ళి ప్రధాని పండిట్ నెహ్రూను కలిశారు. కొద్ది నిమిషాలు మాత్రమే ఇంటర్వ్యూ ఇచ్చి నెహ్రూ సుందరాచారితో మాట్లాడటం ప్రారంభించాక తన పనులన్నీ రద్దు చేసుకుని దాదాపు గంట గంటన్నర గడిపి సుందరాచారి కృషికి జోహార్లు అర్పించారు. అక్కడ సెలవు తీస్కొని తమ సొంత ఊరు తిరుపతికి తిరుగు ప్రయాణమై కాశీని చూద్దామని ఆగారు. ఇక్కడ తెలుగు విద్యార్థులు బాగా ఉన్నారని తెలిసి తెలుగు విశేషాలు చెప్పుకోవాలని యూనివర్శిటీకి వచ్చినట్టు శంకరంబాడి వివరించారు. సంచీలోని పుస్తకాలను చూపించారు. విద్యార్థులు మాకు కావాలి అన్నారు. ఒక్కొక్కటి ఒక రూపాయికి ఇస్తాను తీస్కోమన్నారు. రెండు వరుసలు కూడా పూర్తికాక ముందే పుస్తకాలు అన్నీ అయిపోయాయి. మిగిలిన వాళ్ళు గోలచేశారు. మళ్ళీ ముద్రించినపుడు ఇస్తాను అన్నారు.

మరికొందరు శంకరంబాడి వారిని మాతో మాట్లాడినట్టే మొత్తం బెనారస్ యూనివర్శిటీ విద్యార్థులందరినీ ఉద్దేశించి మాట్లాడాలని కోరారు. వారందరి భాషలు తనకు రావు అన్నారు. మీ ఇష్టమొచ్చిన భాషలో మాట్లాడండి అని ఒప్పించారు. రెండోరోజు మధ్యాహ్నం 2 గంటలకు పండిట్ మదన్ మోహన్ మాలవ్య ఆర్ట్ కాలేజి సెంట్రల్ హాల్లో యావన్మంది విద్యార్థులను ఉద్దేశించి అద్భుతంగా ప్రసంగించి గంటన్నరసేపు అందరినీ ఆనందభరితులను చేశారు. తెలుగు విద్యార్థులందరికీ గర్వకారణం అయ్యారు. నా అదృష్టం కొద్దీ "చక్కగా ఏర్పాటు చేశావోయ్ అని వారితో అభినందనలు పొందాను."

నా ఎమ్మెస్సీ పూర్తయ్యాక అమెరికాలోని అలీగర్ యూనివర్శిటీలో పి.హెచ్.డి. చేశాను. 63–65లో చికాగో యూనివర్శిటీలో పోస్ట్ డాక్టరల్ రీసెర్చి అసోసియేట్‌గా పనిచేసి కెనడాలో సెటిల్ అయ్యేందుకు భార్యాబిడ్డలను తీసుకువెళ్దామని భారతదేశం వచ్చాను. అప్పటికి గుడివాడ ప్రాంతంలోని పెద్దలు కొందరు అక్కినేని నాగేశ్వరరావు పేర కళాశాలను ఏర్పరచి ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఎ.ఎఫ్. త్యాగరాజు అనేవారు ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉంటూ మచిలీపట్నం నోబుల్ కాలేజీ పునఃప్రారంభం కావటంతో మళ్ళీ అక్కడికి వెళ్ళిపోయే సంకల్పంతో ఉన్నారు. తగిన ప్రిన్సిపాల్ కోసం గుడివాడ కాలేజీ వారు వెదుకుతున్నారు. ఆ సమయంలో ఇండియా వచ్చిన నేను వారి కంటపడ్డాను. నన్ను ప్రిన్సిపాల్‌గా ఉండమని ఒత్తిడి చేశారు. నేను కెనడాలో సెటిల్ అవుతున్నానని చెప్పాను. అందులోని పెద్దలు కొందరు మీ చదువు మీకేనా ఈ ప్రాంతానికి ఉపయోగపడేలా చేయగలిగితే బాగుంటుందేమో కదా అని అన్నారు. పెద్దల మాటలకు విలువిచ్చి "అయితే ఒక సంవత్సరం పనిచేస్తాను. నేను మీకు, మీ యాజమాన్యం నాకు నచ్చకపోతే వెళ్ళిపోతానని" అన్నాను. కాని వెళ్ళాల్సిన పనిలేకుండా పోయింది. నాకు చేతినిండా పని దొరికింది. పూరిపాకలో నడిచే కాలేజీని దాతల సహకారంతో విశాల భవనాలను నిర్మించి ఆ కళాశాల రూపురేఖలు తీర్చిదిద్దే బాధ్యత మీద వేసుకుని 35 సంవత్సరాల పాటు వి.ఎస్.ఆర్.కళాశాల ప్రిన్సిపాల్‌గా ఒక ఆదర్శవంతమైన విద్యాసంస్థను నిర్మించగలిగాననే తృప్తిని మూటగట్టుకున్నాను. ఆ కళాశాలలో ప్రవేశపెట్టిన విధానాలు విశ్వవిద్యాలయాలు మార్గదర్శకాలుగా స్వీకరించడం కళాశాల అదృష్టం. ప్రిన్సిపాల్‌గా మారిన తర్వాత తెలుగు భాషకు సంబంధించి శంకరంబాడి సుందరాచారి బెనారస్ యూనివర్శిటీలో నా మనసులో వేసిన ముద్ర మరచిపోలేదు. ఆయనను

తీసుకువచ్చి మా విద్యార్థులకు వారి ప్రసంగాన్ని విన్పించి వారిని ఘనంగా సన్మానించాలని ఆశించాను. ఆనీ అయన చిరునామా దొరకలేదు. ఒకసారి పనిమీద మద్రాసులోని మిత్రుడు కనకమేడల వెంకటేశ్వరరావును కలిశాను. హైస్కూల్లో మేమిద్దరం కలిసి చదువుకున్నాం. ఠాగోర్ గీతాంజలిని అతను అద్భుతంగా అనువదించి నార్లవారి ప్రశంసలు కూడా పొందాడు. డిటెక్టివ్‌లు కూడా రాసేవాడు. మంచి రచయిత. మాటల మధ్యలో శంకరంబాడి గురించి ప్రస్తావన వచ్చి నా మనసులోని కోరిక చెప్పి ఆయన చిరునామా తెలుసా అన్నాను. కనకమేడల పెద్దగా నవ్వి వాళ్ళ మేడపైన ఉన్న గదికి తీసుకువెళ్ళి ఇదే శంకరంబాడి సుందరాచారి ఉంటున్న గది అని చెప్పాడు. అయితే ఆయనను నేను తీస్కెళతాను అని చెప్పాను. ప్రస్తుతం ఆయన ఎక్కడికీ వచ్చే పరిస్థితిలేదని కొన్ని దురలవాట్ల కారణంగా వాటి ప్రభావంతో ఆయన ఊపిరితిత్తులు పూర్తిగా శిథిలమై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని ఇంటికి కూడా ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియదని ఆయన రచయితగా చేసిన సేవ తమ కుటుంబానికి తెలుసుకనుక ఆయన ఉండేందుకు ఇబ్బందైనా అంగీకరించామని వివరిస్తే ఆశ్చర్యపోయాను. ఆయన కోసం చూశాను. కానీ రాలేదు. మరలా కొంతకాలం తర్వాత మద్రాసు వెళ్ళి కనకమేడలను కలిస్తే శంకరంబాడి సుందరాచారి చనిపోయారని చెప్పాడు. నా మనసు వికలమైపోయింది.

తెలుగుభాష మీద, తెలుగు వారి జీవిత విధానం మీద ఆయనకు గల అవగాహన, పట్టు తెలుగుమాట, తెలుగుపాట, తెలుగు వెలుగుకై ఆయన చేసిన కృషి తలచి అరుదైన అలాంటి సవ్యసాచి తెలుగువారికి మళ్ళీ దొరకటం అసాధ్యమని భావించాను. నా యువకవి మిత్రుడు, శిష్యుడు ఎమ్మెస్వీ సత్యనారాయణబాబు తాను తెలుగు భాష మీద పిల్లల కోసం ఒక పాట రాసానని దానిని మరో మహనీయులు కూడా సరిచేశారని చెప్తూ అందులోని పదాలు చెప్పినప్పుడు మళ్ళీ 50 సంవత్సరాల తర్వాత శంకరంబాడి సుందరాచారి నా ఊహల్లో మెదిలారు. ఆయన వామన రూపం, ఆయన ఆనాడు బెనారస్‌లో చేసిన అద్భుత ప్రసంగ విన్యాసం తలుచుకుని పులకరించిపోయాను. నా అనుభవాన్ని రచనగా మలిచే అవకాశం నాకు లేకపోయినా దానిని అందరికీ పంచాలనే కోరికను అర్థం చేసుకుని సత్యనారాయణబాబు నా భావాలను అక్షరశిల్పంగా మలిచేందుకు సహకరించటం ఎంతైనా అభినందనీయం. మూర్తీభవించిన తెలుగుభాషా స్వరూపం తెలుగుదనమే నడిచి నడయాడుతున్నట్లు జీవించి తెలుగు భాషాభివృద్ధి కోసమే వారందరికీ గర్వకారణమైన మహోన్నత వ్యక్తి అనటంలో సందేహమే లేదు.... లేదు....లేదు....

శ్రీ దేవినేని మధుసూదనరావు (తెన్నేరు) గారి సౌజన్యంతో—

గబ్బిట దుర్గాప్రసాద్ 7-9-11.